ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 16 మార్చి 2024



21న అధ్యాపక పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల, మార్చి 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ నెల 21న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ పి.సుజాత తెలిపారు. వర్సిటీలోని 16 విభాగాల్లో 25 అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీలతో పాటు ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఒక అసిస్టెంట్ డైరెక్టర్ భర్తీకి ఇంటర్వ్యూలు జరుపుతున్నామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు నేరుగా ఆ రోజు నిర్దేశించిన సమయానికి ఒరిజనల్ సర్టిఫికేట్లతో హాజరుకావాలన్నారు. దరఖాస్తు పత్రం, ఆయా ఖాళీలకు విద్యార్హతలు, హాజరుకావల్సిన సమయం తదితర సమాచారం వర్సిటీ వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏయూ.ఈడీయూ.ఇన్ పరిశీలించాలని తెలిపారు.

నేడే ఎన్నికల షెడ్యూల్



- వేడెక్కనున్న రాజకీయాలు
- అంతటా ఒకటే చర్చలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

సార్వత్రిక ఎన్నికలకు శనివారం నగారా మోగనుంది. ఈ ఏడాది మే నెలలోగా రాష్ట్రంలో లోక్‌సభతోపాటు అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్ నేడు మధ్యాహ్నం 3 గంటలకు సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనుంది. ఏయే తేదీల్లో ఎన్నికలకు ప్రకటన విడుదల అవుతుందనేదీ.. నామినేషన్ల స్వీకరణ... స్క్రూట్నీ, పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలను వెల్లడించనుంది. జిల్లాలో శ్రీకాకుళం, పలాస, ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట, ఇచ్ఛాపురం, టెక్కలి, ఎచ్చెర్ల నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో ఎచ్చెర్ల నియోజకవర్గం విజయనగరం పార్లమెంట్ పరిధిలో ఉంది. మిగిలిన ఏడు నియోజకవర్గాలు శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. జిల్లాలో శ్రీకాకుళం పార్లమెంట్‌తోపాటు 8 నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. 2019 ఎన్నికలకు సంబంధించి మార్చి 10న షెడ్యూల్ వెల్లడైంది. ఏప్రిల్‌లో ఎన్నికలు జరగ్గా.. మే 23న ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈ సారి కూడా ఏప్రిల్, మే నెలలోనే ఎన్నికలు, ఫలితాలు వెల్లడించే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రధాన రాజకీయపార్టీలైన టీడీపీ, వైసీపీ నుంచి కొంతమంది అభ్యర్థులను ఖరారు చేశారు. టీడీపీ అధిష్ఠానం టెక్కలి, ఇచ్ఛాపురం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది. నేడు షెడ్యూల్ విడుదల కానుండడంతో.. అతిత్వరలో మిగిలిన శ్రీకాకుళం, పాతపట్నం, పలాస, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేయనుంది. సిక్కోలు.. టీడీపీకి కంచుకోట. జిల్లాలో ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్.. 'రా.. కదలిరా', 'శంఖారావం' పేరిట భారీ సభలు నిర్వహించారు. అధికార పార్టీ నేతల అక్రమాలను తూర్పారబట్టారు. రాష్ట్రంలో జరుగుతున్న మోసాల గురించి ప్రజలకు వివరించారు. ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ నేతలు జోష్‌తో ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. వైసీపీ నేతలు మాత్రం అంతర్గతంగా పలుచోట్ల తాయిలాలు పంపిణీ చేస్తున్నారు. వలంటీర్ల ద్వారా నగదు పంపిణీ చేపడుతున్నారు. వైసీపీ నుంచి కొన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించగా.. 17న పూర్తిస్థాయి జాబితా వెల్లడవుతుందని సమాచారం. షెడ్యూల్ అనంతరం రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి. అభ్యర్థుల ప్రచారాలు ఊపందుకోనున్నాయి. ఇప్పటికే అభ్యర్థుల గెలుపోటములుపై చర్చలు సాగుతున్నాయి.

మధ్యాహ్నం నుంచే కోడ్ అమలు..

సార్వత్రిక పోరుకు సంబంధించి శనివారం మధ్యాహ్నం షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. దీంతో ఎక్కడకక్కడ అధికారపార్టీ కార్యక్రమాలు నిలిచిపోనున్నాయి. ఇకపై ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, అధికారిక కార్యక్రమాలు, సమీక్షలు కుదరవు. అధికారపార్టీపైనా.. ప్రతిపక్షంపైనా ఎన్నికల కమిషన్ నిఘా ఉంటుంది.

కోడ్ కూస్తుందని..

- హడావుడిగా అధికారపార్టీ నేతల శంకుస్థాపనలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఎన్నికల కోడ్ కూస్తుందని తెలిసి.. ఈలోగా శంకుస్థాపనలతో మమ అనిపించేద్దామని అధికారపార్టీ నేతలు వారం రోజులుగా హడావుడి చేస్తున్నారు. ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్ విడుదలైతే.. కోడ్ అమల్లో భాగంగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిలిచిపోనున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ నేతలు అభివృద్ధి పనులకు వరుస శంకుస్థాపనలు చేసేస్తున్నారు. ఇందులో రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ముందు వరుసలో ఉన్నారు.

- ఈ నెల 9న బలగలోని కుమ్మరివీధిలో రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి ధర్మాన శంకుస్థాపన చేశారు.
- ఈ నెల 11న శ్రీకాకుళం ఏపీహెచ్‌బీ కాలనీలో కార్గిల్ పార్క్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.
- ఈనెల 14న గూనపాలెంలో రూ.16.5లక్షల వ్యయంతో రాజీవ్‌గాంధీ పార్క్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే దండివీధిలో రూ.10లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బాదుర్లపేటలో రూ.21.80లక్షల వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. కిల్లిపాలెంలో ఎంపీపీ స్కూల్ వద్ద రూ.21.25లక్షల వ్యయంతో సీసీ రోడ్, డ్రైన్, కల్వర్టు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇలా మంత్రితోపాటు అన్ని నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ నేతలు హడావుడిగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ఈ ఐదేళ్లు పట్టించుకోకుండా.. ఇప్పుడు శంకుస్థాపనలు చేసి ప్రయోజనమేంటని ప్రజలు విస్తుపోతున్నారు. ఎన్నికల కోడ్ ప్రకటించే ముందు ఎందుకు ఈ హడావుడీ అంటూ నిట్టూర్పుతున్నారు.

ఫిర్యాదులపై తక్షణ చర్యలు

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మార్చి 15: ఎన్నికల సమయంలో వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్, జిల్లాఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల కంట్రోల్‌రూమ్ నోడల్ అధికారులు, బృంద సభ్యులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటించాలి. ప్రతీ ఒక్కరూ నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి. విధుల నిర్వహణలో సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలి. ఎన్నికల్ కోడ్ తర్వాత వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి. సోషల్ మీడియాలో వచ్చే నకిలీ వార్తలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి. సీ-విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులపై తక్షణ చర్యలు ఉండాలి. తేదీ, నియోజకవర్గం, మండలాల వారీగా నిర్దేశిత పట్టికలో నివేదికలు సిద్ధం చేసుకోవాలి. మీడియా కంట్రోల్ రూమ్ బృందం.. ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే పెయిడ్ న్యూస్, ఎన్నికల ప్రకటనలు పరిశీలించి నివేదికలు రూపొందించాలి. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు, ఈ మెయిల్ వివరాలు అందరికీ తెలిసేలా చర్యలు చేపట్టాలి' అని తెలిపారు. ఎంసీసీ, ఎంసీఎంసీ, సివిజిల్, అకౌంటింగ్, సామాజిక మాధ్యమాలు, టెలికాం ఆపరేటర్, ఫిర్యాదులు తదితర బృందాలకు జేసీ నవీన్ పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్డీవో రంగయ్య, నోడల్ అధికారులు డ్వామా పీడీ చిట్టిరాజు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీఎస్‌వో శాంతిశ్రీ, జడ్పీ సీఈవో వెంకటరమణ, డీపీవో వెంకటేశ్వరులు, గృహనిర్మాణ అధికారి గణపతి, డీఐపీఆర్వో కె.చెన్నకేశవ రావు, వివిధ బృందాల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

అంగన్‌వాడీలకు మొండిచేయి

- సమ్మె కాలానికి అందని వేతనాలు



సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు (ఫైల్)

ఇచ్ఛాపురం, మార్చి 15: అంగన్‌వాడీ కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపింది. సమస్యల పరిష్కారం కోరుతూ.. 42 రోజులపాటు చేసిన సమ్మె కాలానికి సంబంధించి వేతనాల మంజూరులో నిర్లక్ష్యం వహిస్తోంది. 'అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సమ్మె కాలానికి కూడా వేతనాలు చెల్లిస్తాం' అని మంత్రి సీదిరి అప్పలరాజు కొన్నాళ్ల కిందట హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వం ఇంత వరకూ వేతనాలు చెల్లించలేదని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను అడిగినా ఆశించినస్థాయిలో స్పందన కనిపించడం లేదని వాపోతున్నారు. జిల్లాలో 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 3358మంది చొప్పున అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పనిచేస్తున్నారు. హామీలు అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతేడాది డిసెంబరు 12 నుంచి ఈ ఏడాది జనవరి 22 వరకు 42 రోజులపాటు సమ్మె చేశారు. సమ్మెకాలానికి సంబంధించి కార్యకర్తలకు రూ.15,350, ఆయాకు రూ.9,340 చొప్పున చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి ఈ వేతనాలు మంజూరు చేయాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.



బృందావతి ఆలయంలో పెళ్లివారికి అలంకార వస్తువులు అందజేస్తున్న గ్రామపెద్దలు

నువ్వలరేవులో పెళ్లిసందడి

- నేడు సామూహిక వివాహాలు
- ఒక్కటి కానున్న 61 జంటలు

వజ్రపుకొత్తూరు, మార్చి 15: నువ్వలరేవులో పెళ్లి సందడి నెలకొంది. శనివారం సంప్రదాయబద్ధంగా సామూహిక వివాహాలు నిర్వహించనున్నారు. అర్ధరాత్రి 1.55 గంటలకు 61 జంటలు ఒక్కటి కానున్నాయి. పెళ్లి వేడుకల్లో భాగంగా శుక్రవారం గ్రామంలో యువతీ యువకులు ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుని.. హోలీ వేడుకలు చేసుకున్నారు. తర్వాత గ్రామదేవత బృందావతి ఆలయం లో గ్రామపెద్దలు సమక్షంలో పెళ్లివారికి వధూవరుల అలంకార వస్తువులు అందించారు. అనంతరం మంగళస్నానం కోసం మట్టికుండలు తీసుకువెళ్లేందుకు పెళ్లివారు బంధువులతో ఊరేగింపుగా వెళ్లారు. 300 ఏళ్లుగా పూర్వీకులు ఆచరించిన సంప్రదాయాన్ని తాము కొనసాగిస్తున్నామని, రెండేళ్లకోసారి సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామని స్థానిక సర్పంచ్ ఏజ్రా తెలిపారు. ఇదిలా ఉండగా.. బాల్య వివాహాలపై జిల్లా న్యాయసేవా సంస్థ, జిల్లా బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన కల్పించారు.

ప్రగతి తప్పిన పర్యాటకం

- నిధులున్నా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- అల్లర్లు, తగాదాలతో సౌకర్యాలు దూరం
- సాగరతీరంలో పర్యాటకులకు తప్పని అవస్థలు
- మత్స్యకారులకూ ఉపాధి కరువు



వేట సాగక బోటును ఒడ్డుకు చేరుస్తున్న మత్స్యకారులు



కుందువానిపేటలో మూతపడిన వంట దుకాణం



శిథిలావస్థలో పర్యాటక భవనం

(శ్రీకాకుళం రూరల్)

పర్యాటక అందాలకు నెలవు సిక్కోలు. సహజ వనరులు ఉన్న సువిశాల సాగర తీరం.. ఎటు చూసినా పచ్చటి కొండలు.. ఏజెన్సీలో కట్టిపడేసే జలపాతాలు.. రూ.కోట్ల విలువైన ఖనిజ సంపద.. ఇవన్నీ జిల్లాకు ఆభరణాలు. అభివృద్ధి చేస్తే లక్షల్లో పర్యాటకులను ఆకర్షించ గలిగిన ప్రదేశాలు జిల్లాలో ఎన్నో ఉన్నాయి. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిపై పర్యాటకశాఖ పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో ప్రగతి తప్పింది. నిధులున్నా వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా పట్టించుకోకపోవడంతో పర్యాటక ప్రాంతాలు కళావిహీనంగా మారాయి. సిక్కోలును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్న నేతల హామీలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ప్రధానంగా జిల్లాలో సాగరతీరంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో పర్యాటకులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు మత్స్యకారులకు కూడా సక్రమంగా ఉపాధి దక్కడం లేదు. ఎచ్చెర్ల మండలంలోని బుడగట్లపాలెం, బడివానిపేట, మత్స్యలేశం, బొంతలకోడూరు పంచాయతీ పాతదిబ్బలపాలెం, శ్రీకాకుళం మండలంలోని కుందువానిపేట, పెద్దగనగళ్లవానిపేట, గార మండలంలోని కళింగపట్నం, మొగదలపాడు తీరప్రాంతాలు జిల్లా కేంద్రానికి ఆనుకున్న ఉన్న పర్యాటక కేంద్రాలు. ఈ ప్రాంతాల్లో నిత్యం పర్యాటకులు ఉండేవారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయకపోవడంతో పర్యాటకులు ఆహ్లాదానికి దూరమవుతున్నారు.

- టీడీపీ ప్రభుత్వ హయాంలో కళింగపట్నం బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేశారు. గ్రానైట్ బల్లలు, బుద్ధుడు, డైనోసార్‌లు, జిరాఫీలు, ఏనుగులు వంటి పెద్ద పెద్ద బొమ్మలు ఏర్పాటు చేశారు. బీచ్ ఫెస్టివల్ కూడా నిర్వహించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక రంగాన్ని గాలికొదిలేసింది. కళింగపట్నంలో పర్యాటక అభివృద్ధి పనులు నిలిపేసింది. దీంతో బీచ్ సందర్శకుల కోసం నాడు ఏర్పాటు చేసిన బొమ్మలు, గ్రానైట్ బల్లలు ఇసుక కోతతో సముద్రంలో కలిసిపోయాయి. పర్యాటకుల కోసం నిర్మించిన భవనాలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి.
- శ్రీకాకుళం మండలం కుందువానిపేటలో బీచ్ సందర్శకులను ఆకర్షించేందుకు మత్స్యకారులు వేట నుంచి లభించే తాజా చేపలను వండి విక్రయించేవారు. దీంతో రోజురోజుకూ పర్యాటకుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. మత్స్యకారులకు కూడా ఉపాధి దొరికేది. కాగా కొందరు ఆకతాయిలు, అల్లరిమూకల చేష్టలతో నేడు ఆ ప్రాంతంలో కూడా పర్యాటకులు కరువయ్యే పరిస్థితి నెలకొంది. కొద్దిరోజుల కిందట కొంత మంది అల్లరిమూకలు కాల్చిన సిగరెట్‌లను వలలపై పడేశారు. దీంతో వలలతోపాటు గుడిసెలు కాలిపోయాయి. ఈ నేపథ్యంలో అక్కడ భోజన సౌకర్యాలు కల్పించేవారిని దుకాణాలు మూసివేయాలని గ్రామస్థులు చెప్పారు. ఈ క్రమంలో సందర్శకుల తాకిడి కూడా తగ్గింది. సముద్రంలో వేట కూడా సక్రమంగా సాగక మత్స్యకారుల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలో ఏ తీరప్రాంతం చూసినా.. కోతకు గురవడం, భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం.. సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని పర్యాటకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పర్యాటకశాఖ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సందర్శకులు, మత్స్యకారులు కోరుతున్నారు.

● రూ.3 కోట్లతో ప్రణాళికలు

పర్యాటక అభివృద్ధిలో భాగంగా పెద్దగనగళ్లవానిపేట బీచ్‌లో సందర్శకుల కోసం రెస్టారెంట్‌లు, బెంచ్‌లు, బోటింగ్ ఏర్పాటు చేస్తున్నాం. కళింగపట్నం బీచ్, హిరమండలం రిజర్వాయర్ వద్ద ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో బోటింగ్ అందుబాటులోకి తెస్తాం. మొత్తంగా రూ.3కోట్లతో అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేశాం.

-నారాయణరావు, జిల్లా పర్యాటకశాఖ అధికారి



ఇచ్ఛాపురంలో విద్యార్థినుల కేరింతలు



నరసన్నపేటలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

బై.. బై..

- ముగిసిన ఇంటర్ పరీక్షలు
- ఇంటిముఖం పట్టిన హాస్టల్ విద్యార్థులు

నరసన్నపేట/ఇచ్ఛాపురం, మార్చి 15: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 1 నుంచి 83 కేంద్రాల్లో ఇంటర్ బోర్డు అధికారులు పరీక్షలు నిర్వహించారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి 19,937 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షకు 25,765 మంది ఫీజు చెల్లించారు. వీరిలో మొత్తంగా 3,349 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. శుక్రవారంతో ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగిశాయి. పరీక్ష అనంతరం కేంద్రాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులంతా ఓవైపు ఆనందం, మరోవైపు రెండేళ్ల కలసిమెలసి విడిపోతున్నామన్న బాధతో బై.. బై.. అంటూ వీడ్కోలు చెప్పుకున్నారు. ఉన్నత భవిష్యత్ కోసం ఏ కోర్సుకు ఆఫర్ చేయాలనే విషయంపై చర్చించుకున్నారు. కొంతమంది ఇంజనీరింగ్, వైద్యవృత్తిలో ప్రవేశించేందుకు సంబంధిత పరీక్షలకు సిద్ధమవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు కోచింగ్ తీసుకోనున్నారు. కామర్స్ విద్యార్థులు సీఏ ఫౌండేషన్ కోర్సు పరీక్షలకు సన్నద్ధం కానున్నారు. ఇంటర్ పరీక్షలు ముగియడంతో సోషల్‌వెల్ఫేర్ కళాశాలలో చదివే విద్యార్థులు ఇంటిబాట పట్టారు. జిల్లాలో దుప్పలవలస, తామరాపల్లి, ఎచ్చెర్ల, నందిగాం, కంచిలి తదితర ప్రాంతాల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వమే సాంఘీక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎంసెట్‌కు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రేపు గ్రూప్-1 పరీక్ష

- జిల్లాలో 18 కేంద్రాల్లో ఏర్పాట్లు
- హాజరుకానున్న 6404 మంది అభ్యర్థులు
- పకడ్బందీగా నిర్వహించాలని జేసీ ఆదేశం

కలెక్టరేట్, మార్చి 15: గ్రూప్-1 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్, ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల నిర్వహణ సమన్వయాధికారి నవీన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం గ్రూప్-1 పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు సంబంధించి శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ నవీన్ మాట్లాడుతూ.. 'జిల్లావ్యాప్తంగా 18 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నాం. 6,404 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒక్కొక్క లైజన్ అధికారిని నియమించాం. పరీక్ష ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరుగుతుంది. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా దూరప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులను నడపాలి. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలి. సమయపాలన పాటించాలి' అని ఆదేశించారు. దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను వివరించారు. ఏపీపీఎస్సీ సహాయ కార్యదర్శి సురేష్‌బాబు మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్ అనుమతించబడదని, పరీక్ష నిర్వహణకు తీసుకోవలసిన పలు అంశాలను వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జిల్లా అధికారులు ఏసీపీ జయప్రకాష్, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీపీవో వెంకటేశ్వర్లు, మునిసిపల్ హెల్త్ అధికారి వెంకటరావు, మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ రామారావు, క్రాంతి ఇతర అధికారులు, ఆయా కళాశాలల, పాఠశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ నవీన్

వైసీపీని ఇంటికి పంపించాలి

● బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం


పొందూరు: రాపాకలో ఇంటింటా ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన కూటమి నాయకులు


టెక్కలి: బూరగాం పంచాయతీ రామేశ్వరంలో సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు బగాది శేషగిరి


సంతబొమ్మాళి: నౌపడ ఉప్పుగల్లీ కాలనీలో సూపర్ పథకాలపై ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఇంటికి పంపించాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు.

కూటమితో వైసీపీలో ప్రకంపనలు: కూన

పొందూరు: రాష్ట్రంలో టీడీపీ,బీజేపీ, జనసేనపార్టీల కూటమితో వైసీపీలో ప్రకంపనలు మొదలయ్యాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ తెలిపారు. మండలంలోని రాపాకలో టీడీపీ, జనసేన నాయకులు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు.అధికార వైసీపీ దుర్మార్గాలు, వైఫల్యాలను కూటమి ద్వారా వివరించి ప్రజల భవిష్యత్తుకు ఇచ్చే హామీని ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు సూపర్‌సిక్స్‌కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్,టీడీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు ఎ.రాము, బి.శంకరభాస్కర్, బాడాన గిరి,వై.రమణ, ఖండాపు శ్రీను, బుజ్జి, వై.రమణ, కె.అప్పలనాయుడు, వాసు, వి.రామారావు, గొల్లయ్య, మనోహర్, పి.ఆనంద్, పి.వేణు, డి. గణపతి పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి

కవిటి: టీడీపీని ఆదరించి రానున్న ఎన్నికలల్లో ఉమ్మడి అభ్యర్థులను


కవిటి: మాణిక్యపురంలో ప్రచారం నిర్వహిస్తున్న నిలోత్పల

గెలిపించాలని ఎమ్మెల్యే అశోక్ సతీమణి నిలోత్పల కోరారు. మాణిక్యపురంలోబాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీతో పాటు సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటా వివరించారు. ఆమెవెంట నాయకులు దేవికాజెన్నా, బి.చిన్న బాబు, కల్యాణి, భాగ్యశ్రీ, మురళి బిసాయి, దుర్యోధన బెహరా, గోవింద బెహరా ఉన్నారు.

కూటమిని ఆదరించండి

సరుబుజ్జిలి: రాష్ట్రంలో త్వరలోజరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని ప్రతిఒక్కరూ ఆదరించాలని టీడీపీ నాయకులు ఎండు రామారావు, దవల సింహాచలం పిలుపునిచ్చారు. సరుబుజ్జిలి పంచాయతీ పెద్దవీధిలో టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా శంఖారావం, సూపర్‌సిక్స్ కార్య క్రమాన్ని నిర్వ హిం చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బి.శ్రీనివాసరావు, రామ్మూరి నాయుడు, దవళ సురేష్, పాతిన శ్రీనివాసరావు, బగాది బాస్కరరావు, రమణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయం

జలుమూరు(సారవకోట): అన్నివర్గాల అభ్యున్నతేధ్యేయమని సారవకోట మండల టీడీపీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ తెలిపారు. మండలంలోని బుడితిలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముద్ద భీమారావు, డి.జయరాం, తర్ర లచ్చుము, ఆనందరావు, వేణుగోపాలరావు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమమే లక్ష్యం

సంతబొమ్మాళి: బడుగు బలహీన వర్గాల సంక్షేమమే టీడీపీ ధ్యే యమని తెలుగు యువత నాయకులు సుగ్గు స్వరూప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నౌపడ ఉప్పుగల్లీ కాలనీల్లో ఇంటింటా సూపర్‌సిక్స్ పథకాలపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ ప్రభాకర్, సూరాడ ధనరాజ్, అశిరినాయుడు,గూట్ల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిని సాగనంపండి

నందిగాం: మోసపూరితంగా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో సాగనంపాలని టీడీపీ మండలాధ్యక్షుడు పి.అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని నౌగాంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.బాలకృష్ణ, టి.ఉమామహేశ్వరరావు, కె.విశ్వనాథం, వి.లక్ష్మణరావు, కె.ధర్మారావు, హరిబాబు, ఎం.సింహా చలం, మెట్ట పద్మావతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సారవకోట మండలంలోని బుడితిలో భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ


నందిగాం: నౌగాంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న తెలుగుదేశం నాయకులు


సరుబుజ్జిలి: సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న నాయకులు

రేపు పలాసలో ఎల్లమ్మ జాతర


ఆలయంలో అమ్మవారికి ఆవాహం చేస్తున్న తప్పెటగుళ్లు, డప్పు వాయిద్య కళాకారులు

పలాస: స్థానిక ఎల్లమ్మవీధిలో వెలసిన ఆలయంలో ఆదివారం జరిగే జామి ఎల్లమ్మజాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా శివరాత్రి అనంతరం తొమ్మిదో రోజున ఇక్కడ తర్లాకోట జమిందార్ల కాలం నుంచి సంప్రదాయపద్ధతిలో జాతర నిర్వహిస్తారు. రాష్ట్రంతోని పలు ప్రాంతాలతో పాటుఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు యాత్రకు తరలివచ్చి ఎల్లమ్మను దర్శించుకుంటారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆవాహన కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేళతాళాలు, తప్పెటగుళ్ళ, డప్పు వాయిద్యాలతో అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అమ్మవారి జంగెడిని నిర్వాహకులు కొల్లకోట శ్రీనివాసరావు తలపై పెట్టుకొని సంప్రదాయ పద్ధతిలో తర్లాకోటలోని జమిందారి వంశస్థులు పూజలు చేసే అమ్మవారి ఆలయానికి తరలివెళ్లారు. శనివారం సింధూర పంట(సిందూరం తీయడం)తో అమ్మవారి జాతర ప్రారంభమవుతుంది. జమిందారి వంశస్థులు తొలి పూజ జరపడంతో పాటు అమ్మవారి ఆలయాన్ని శుద్ధి చేసే కార్యక్రమం నిర్వహించిన అనంతరం భక్తులకు ఎల్లమ్మను దర్శనం కల్పిస్తారు. అమ్మవారికి పడి(బియ్యం, వేప ఆకులు) ముడి కట్టి ఆలయ శిఖరంపై విసరడం ఆచారంగా వస్తోంది. లక్షలాది మంది భక్తులు ఆదివారం వేకువజాము నుంచి రాత్రి 12 గంటల వరకూ దర్శనం చేయడానికి ఏర్పాట్లు చేశారు. తర్లాకోట జమిందారుల నుంచి కొల్లకోట వంశీయులు ఆలయ అర్చకులుగా నిర్వహిస్తున్నారు.

హిరమండలంలో..

హిరమండలం: హిరమండలం పెరికివీధిలో గల సిర్లుపోతన్న ఎల్లమ్మ తల్లి జామి యాత్రను ఆదివారం నుంచి మూడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు టెక్కలిపట్నంలో..

పలాస రూరల్: మండలంలోని టెక్కలిపట్నంలో వెలసిన ఎల్లమ్మ ఆలయం వద్ద శనివారం ఉదయం నుంచి జామిజాతర జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఏటా ఫాల్గుణమాస మృగశిర నక్షత్రయుతంతో జామిజాతర పూర్వీకుల నుంచి ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు మునిసిపల్ సమావేశం

పలాస: మునిసిపాలిటీ అత్యవసర సమావేశాన్ని శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు చైర్మన్ బళ్ల గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తూరు: కొత్తూరులో 11 కేవీ ఎంహెచ్‌క్యూ ఫీడర్‌లో నిర్వహణ పనులు నిమిత్తం విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తూరు, కర్లెమ్మ, మహాసింగి, పారాపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు నిలిపివేయనుండడంతో వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

హిరమండలం: స్థానిక కేజీబీవీలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి,ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్‌లోదరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తగతి,ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి 40సీట్లు చొప్పున,7,8,9 తరగతుల్లో మిగులు సీట్లు కూడా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 11లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎన్నికల సమయంలో నిఘా పెంచాలి: ఆర్వో


మాట్లాడుతున్న ఆర్వో రామ్మోహనరావు

నరసన్నపేట: ఎన్నికల సమయంలో మరింత నిఘా పెంచాలని నియోజవర్గ ఆర్వో జీవీఎస్ఎస్ రామ్మోహనరావు సూచించారు. శుక్రవారం నరసన్నపేటలో నోడల్ అధికారులు, స్క్వాడ్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్ కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్లు కనకరావు, నాగమ్మ పాల్గొన్నారు.

సహకార పరపతి సంఘాలను బలోపేతం చేయాలి

టెక్కలి: సహకార పరపతి సంఘాలు బలోపేతం చేయాలని రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్ఎల్ శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం టెక్కలిలో పీఏసీఎస్ సంఘాల పాలకవర్గ సభ్యులు, సీఈవోలు,సిబ్బందితోసమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఈవో వరప్రసాద్, సహకారఅధికారి సుబ్బారావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

నందిగాం: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు, వక్తలు ఆకాంక్షిం చారు.శుక్రవారం నందిగాం ఉన్నతపాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు వై.హరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యు.రాము, సూర్యనారాయణ, అప్పారావు, శ్రీనివాసరావు, చైర్మన్ చిన్నారావు పాల్గొన్నారు.

చీకటి పాలనను తరిమికొట్టాలి

● టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల పిలుపు


నరసన్నపేట: సంఘీభావం తెలియజేస్తున్న కూటమి నాయకులు

నరసన్నపేట: చీకటిపాలనను తరిమికొట్టడానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి, బీజేపీ నియోజవకర్గ ఇన్‌చార్జి రెడ్డిభాగ్యలక్ష్మి, జనసేనకన్వీనర్ బలగ ప్రవీణ్ పిలుపునిచ్చారు. గురువారం నరసన్నపేట టీడీపీ కార్యాలయంలో మూడు పార్టీల నాయకులు ఉమ్మడి అభ్యర్థి బగ్గురమణమూర్తినిఅభినందించారు.ఈసందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా పొత్తులు పెట్టుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు జల్లు చంద్రమౌళి, బైరి భాస్కరరావు,శిమ్మ చంద్రశేఖర్, బగ్గుగోవిందరావు, మిరియపల్లి వెంకట అప్పలనాయుడు, కత్తిరి వెంకటరమణ, చిట్టిబాబు, కింజరాపు రామారావు పాల్గొన్నారు.

రమణమూర్తిని గెలిపిస్తాం

పోలాకి: నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తికి శుక్రవారం మబగాంలోని ఆయన నివాసంలో జనసేన, టీడీపీ నాయకులు అభినందించారు. అధిక మెజార్టీతో రమణమూర్తిని గెలిపిస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిబలగ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బగ్గుసుగుణ, ఎంవీనాయుడు, రాంబాబు, ఎన్.రవి, నందు పల్లి దండాసి, వీరమహిళలు, టీడీపీ,జనసేన నాయకులు పాల్గొన్నారు.

'నగర'లను డిక్లరేషన్‌లో పెట్టడంపై హర్షం


చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాల అభిషేకం చేస్తున్న నాయకులు

కొత్తూరు: నగర కులాన్ని టీడీపీ-జనసేన పార్టీల ఉమ్మడి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా అధికారంలోకి రాగానే బీసీ డీ నుంచి బీసీఏలోకి మారుస్తామని పేర్కొనడంపై ఆ కుల సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు. ఈమేరకు శుక్రవారం మెట్టూరులో టీడీపీ నగర సాధికార సభ్యుడు పిండి అప్పన్న ఆధ్వర్యంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్ చిత్రపటాలకు పాల అభిషేకం చేశారు.

వైసీపీకి బుద్ధిచెప్పాలి

● టెక్కలిలో ఆదివాసీల దీక్ష


టెక్కలిలో దీక్ష చేస్తున్న ఆదివాసీలు

టెక్కలి: రాష్ట్రప్రభుత్వం ఆదివాసీలపై నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తుండడంతో రానున్న ఎన్నికల్లో వైసీపీకి బుద్ధిచెప్పాలని ఆదివాసీ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు సవర చొక్కారావు, ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్య దర్శి నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఇందిరాగాంధీ కూడలిలో ఆదివాసీలు నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదివాసీ సంఘాలు జీవో-52 రద్దు చేయాలని ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడలేదని ఆరోపించా రు.కాగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘ కార్యదర్శి వరహాల కృష్ణారావు, జిల్లా కన్వీనర్ షణ్ముఖరావు, ఉపాధ్యక్షులు కాంతారావు, జగ్గారావు, సంజీవరావు, రామచంద్రులు పాల్గొన్నారు.

వైసీపీకి ఇవే చివరి ఎన్నికలు


మాట్లాడుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

టెక్కలి: వైసీపీకి ఇవే చివరి ఎన్నికలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తెలిపారు.శుక్రవారం టెక్కలిలో మూడుపార్టీల నాయకులు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నియంత పాలనకు స్వస్తి చెప్పడానికి ఉమ్మడిగా జతకట్టినట్లు తెలిపారు.ఆదివారం చిలకలూరుపేటలో జరిగే బహిరంగసభకు ప్రజలు తరలి రావాలని కోరారు. గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు జరిగాయని, రాష్ట్ర ప్రభుత్వం ఈ పోస్టులు కోట్ల రూపాయలకు అమ్ముకుందని ఆరోపించారు. జాబ్‌క్యాలెండర్ హామీ అటుకెక్కిందని విమర్శించారు. సమావేశంలో టీడీపీ నాయకులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, జీరు భీమారావు,బోయిన రమేష్, జనసేన నుం చి కణితి కిరణ్‌కుమార్, బీజేపీ నుంచి నడుపూరు లక్ష్మీనారాయణ, అట్టాడ రాజేష్, ధూపాన కామేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

వజ్రపుకొత్తూరు: బాలల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, లత పేర్కొన్నారు. మండలంలోని రిట్టపాడు, పూండి గోవిందపురంలో పౌష్టికాహారపక్షోత్సవాలు పురస్కరించుకుని హోం విజిట్ కార్యక్రమంలో భాగంగా బాలల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు.కార్యక్రమంలో హెల్త్‌ఎగ్జిక్యూటివ్ మంగమ్మ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు: ఈవో

నరసన్నపేట: పట్టణంలో అక్రమనిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలుతీసుకుంటామని ఈవో చిన్నారావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రాజేశ్వరి థియేటర్, మేఘన హోటల్, సత్యవరంజంక్షన్ వద్ద అక్రమనిర్మాణాలను పరిశీలించారు. అనుమతిలేకుండా నిర్మాణాలు చేపట్టరాదని తెలిపారు.ప్రభుత్వస్థలాల్లో నిర్మాణాలు నిలిపివేశారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

వజ్రపుకొత్తూరు: గరుడుభద్ర హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సర్పంచ్ గూడ గిరిజా ఆధ్వర్యంలో పరీక్షసామగ్రి శుక్రవారం పంపిణీచేశారు. కార్యక్రమంలో హెచ్ఎం దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు దిలీప్‌షాహూ పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

పలాస రూరల్: మండలంలోని బొడ్డపాడులో శుక్రవారం విలేజ్ హెల్త్‌క్లినిక్, ఎస్సీ వీధిలో కమ్యూనిటీ భవనాలను మంత్రి డాక్టర్ అప్పలరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ తామాడ మదన్, పీఏసీఎస్ అధ్యక్షుడు పైల వెంకటరమణ పాల్గొన్నారు

చేయూత నిధుల విడుదల

ఎల్.ఎన్.పేట: ఎల్.ఎన్.పేటలో శుక్రవారం నాలుగో విడత వైఎస్ఆర్ చేయూత నిధులను ఎమ్మెల్యే రెడ్డిశాంతి విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్. జ్యోతిలక్ష్మి, ఎంపీడీవో గిరిబాల, ఈవోపీఆర్‌డీ పద్మజ, ఏపీఎం రవి రాజ్ పాల్గొన్నారు.

అక్రమ బదిలీలు రద్దుచేయాలి



నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

టెక్కలి: ఉపాధ్యాయుల అక్రమబదిలీలు రద్దుచేయా లని టెక్కలి ఎంఆర్సీ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా ఉపాధ్యాయులకు సంబంధించి తప్పిదాలకు పాల్పడుతోందని ఆరోపించారు.కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కె.దాలయ్య, టి.వైకుంఠరావు, కుమారస్వామి, విజయ్‌కుమార్, నరేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఒడిశా మద్యం స్వాధీనం

కొత్తూరు: మండలంలోని కౌసల్యాపురం వద్ద అక్రమంగా తరలిస్తున్న ఒడిశా మద్యం కొత్తూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కడుం గ్రామానికి చెందిన లెంక ఫల్గుణరావు నుంచి ఒడిశాకుచెందిన 96 మద్యం సీసాలను కొత్తూరు ఎస్ఐ ఎంఏ అహ్మద్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

నువ్వలరేవు సర్పంచ్‌గా కమలమ్మ

వజ్రపుకొత్తూరు: మండలంలోని నువ్వలరేవు పంచాయతీకి రెండోవార్డు సభ్యురాలు ముథ్వల కమలమ్మను సర్పంచ్‌గా నియమిస్తూ రాష్ట్రపంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి కె.కన్నబాబు ఆదేశాలు జారీచేసినట్లు పంచాయతీ కార్యదర్శి బాదల్‌షా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నువ్వలరేవు పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్‌గా ఎన్నికైన బి.రఘునాథ్, బి.కృష్ణ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు తెలిపారు.దీంతో పంచాయతీ వ్యవహారాలు నిర్వహణకు కమలమ్మను సర్పంచ్ నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి

సంతబొమ్మాళి: పంచాయతీలో ఇంటిపన్ను వసూలు వేగవంతం చేయాలని టెక్కలి డీఎల్‌పీవో ఐవీ రమణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. పంచాయతీల్లో క్యాస్‌లెస్ ట్రాన్సాక్షన్, స్వామిత్ర, ప్రధాన మంత్రి విశ్వ కర్మ యోజన పథకాలకు ప్రజలకు చేరువయ్యేలా కార్యదర్శులు పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఈవోపీర్డీ గోపాలరావు, పంచాయతీకార్యదర్శులు శ్రీనివాసరావు, రాజు, ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అవగాహనతోనే వినియోగదారులకు న్యాయం

● జిల్లా వినియోగదారుల వ్యవహారాల కమిషన్ చైర్‌పర్సన్ రఘుపాత్రుని చిరంజీవి

కలెక్టరేట్: వినియోగదారుల చట్టంపై అవగాహనతోనే వారికి న్యాయం జరుగుతుందని జిల్లా వినియోగదారుల వ్యవహారాల కమిషన్ చైర్‌పర్సన్ రఘుపాత్రుని చిరంజీవి తెలిపారు.శుక్రవారం కలెక్టరేట్‌లో పౌరసరఫరాలు, సంబంధితశాఖల ఆధ్వర్యంలో ప్రపంచవినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూదేశంలో10వేల జీపీ యూనిట్స్‌ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జేసీ ఎం.నవీన్ మాట్లాడుతూ వినియోగదారులెవరూహక్కును కోల్పోకూడదని, అందుకే కృత్రిమ మేధాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫోరం సభ్యుడు బగాది రామ్మోహనరావు, జిల్లా సరఫరాల అధికారి శాంతిశ్రీ, పౌరసరఫరాల మేనేజర్ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

● **సంతబొమ్మాళి:** దండుగోపాలపురం జడ్పీ ఉన్నతపాఠశాలలో వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం కోత చైతన్య వినియోగదారుల హక్కులపై విద్యా ర్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు వినియోగదారుల హక్కులను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, ఆదికేశవరెడ్డి, వీరభద్రరావు పాల్గొన్నారు.

● **టెక్కలి:** వినియోగదారులు హక్కులు, చట్టాలు గుర్తెరగాలని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌కుమార్ తెలిపారు టెక్కలి డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగ దారుల దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు కల్తీవస్తువుల తయారీ, ఆన్‌లైన్ వ్యాపారంలో మోసాలు, వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో అధ్యాపకులు రామారావు, హేమరాజు, లోకేశ్వర రావు, సింహాచలం పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

నందిగాం: నందిగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల ఒకటో తేదీ నుంచి నిర్వహించిన ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక కళాశాల విద్యార్థులతో పాటు గురుకుల కళాశాల, కేజీబీవీ విద్యార్థినులు ఇక్కడ పరీక్షలు రాశారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు ఆనందం పంచుకొని సందడి చేశారు. కాగా ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు చీఫ్‌సూపరింటెండెంట్ ఆర్.జనార్దనరావు తెలిపారు.

వైభవంగా మురళీకృష్ణ కల్యాణం

జలుమూరు: అబ్బాయిపేటలో వెలసిన మురళీకృష్ణ రుక్మిణి, సత్యభామల కల్యాణం ఆలయ అర్చకులు దివాకర్ నేతృత్వంలో శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మురళీకృష్ణ ఆలయ 45వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజల భక్తులకు స్వామిదర్శనం కల్పించారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి శ్రీకూర్మం వాస్తవ్యులు చామర్తి జగన్నాథాచార్యులు ఆధ్వర్యంలో సీతారామశాస్త్రి ఏకాహ్నిక స్వామివారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో అబ్బాయిపేట, గంగాధరపేట, కేఎల్ఎన్‌పేట, ఊడిగలపాడు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సమస్య తీరేదెన్నడో?

- ఇచ్ఛాపురంలో అస్తవ్యస్తం
- ఫుట్‌పాత్‌ల ఆక్రమణ
- కానరాని పార్కింగ్ స్థలాలు
- రోడ్లపైనే ఆపేస్తున్న ద్విచక్ర వాహనాలు


ఎస్‌బీఐ రోడ్డులో నిలిచిన వాహనాలు

(ఇచ్ఛాపురం)

ఇచ్ఛాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ప్రయాణమంటేనే హడలిపోతున్నారు. పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనదారులు ఎక్కడ పడితే అక్కడ తమ వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. కొందరు ద్విచక్ర వాహనదారులు రోడ్లపైనే ఆపేస్తున్నారు. పాత బస్టాండ్ జంక్షన్, వీకేపేట రోడ్డు, బజార్ సెంటర్ రోడ్డుకు ఇరువైపులా దుకాణదారులు ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమించేశారు. వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు తమ వాహనాలను నడిరోడ్డు మీద పెడుతున్నారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. మార్కెట్ జంక్షన్, వీకేపేట జంక్షన్, రథంవీధి జంక్షన్, మార్కెట్ వెనుక భాగం, మిషన్ కొట్టు లైన్‌లో ట్రాఫిక్ సమస్య నానాటికీ పెరుగుతోంది. ఈ రోడ్లపై ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. పట్టణంలో పార్కింగ్ స్థలాలు కరువయ్యాయి. వాహనాల పార్కింగ్ కోసం స్థలాలు కేటాయించాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వాహనదారులు రోడ్లపైనే వాహనాలు నిలుపుదల చేస్తున్నారు. ఎస్‌బీఐ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ప్రధానంగా ఇసుక ట్రాక్టర్ల కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోవటం లేదు. ఇప్పటికైనా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


పాత బస్టాండ్ జంక్షన్ వద్ద రోడ్డు మధ్యలోనే..


పట్టణంలో నిత్యమూ ఇదే పరిస్థితి

పార్కింగ్ స్థలం కేటాయిస్తాం

మున్సిపాల్టీ పరిధిలో పార్కింగ్ స్థలం లేకపోవడంతో షాపుల వద్ద రోడ్లపై వాహనాలు నిలిపివేస్తున్నారు. పార్కింగ్ స్థలం కోసం పరిశీలిస్తున్నాం. ప్రభుత్వం స్థలం గుర్తించి వాహనాల పార్కింగ్ కోసం కేటాయిస్తాం.

- ఎన్.రమేష్, మున్సిపల్ కమిషనర్

ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించాం

పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించాం. స్టేట్ బ్యాంకు రోడ్డులో భారీ వాహనాలు రాకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే బ్యాంక్ వద్ద పోలీస్ గస్తీ పెట్టాం. భారీ వాహనాలు ఉదయం 8గంటల లోపు, రాత్రి 8గంటల తరువాత పట్టణంలోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.

- ఇమ్మాన్యుయల్ రాజు, సీఐ, ఇచ్ఛాపురం

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


శంకరరావు (ఫైల్)

ఎచ్చెర్ల: పాతపొన్నాడ గ్రామానికి చెందిన గంగు శంకరరావు (29) అనే వ్యక్తి శుక్రవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శంకరరావు తన సొంత ఇటుక తయారీ కేంద్రం వద్ద పాడైన మోటారుకు మరమ్మతు చేసి తిరిగి అమరుస్తుండగా షార్ట్ సర్క్యూట్‌కు గురై మృతి చెందాడు. ఈయన ఇదే పంచాయతీ పరిధిలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శంకరరావుకు ఏడాది కిందట ఇదే పంచాయతీ బింగుపేటకు చెందిన పల్లవితో వివాహమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. శంకరరావు భార్య ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలతో వివాహిత అదృశ్యం

శ్రీకాకుళం క్రైం: పిల్లలతో సహా ఓ వివాహిత అదృశ్యమైన ఘటన నగరంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఎల్‌బీఎస్ కాలనీలో నివాసం ఉంటున్న చింతాడ రాజవర్థన్.. తన భార్య బొమ్మాళి తులసి, ఐదేళ్ల కుమార్తె హాసిని, మూడేళ్ల కుమారుడు వేదికతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో తులసి తన పిల్లలను పార్కుకి తీసుకెళ్తానని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఎంతసేపటికి రాకపోవడంతో పరిసరాలతోపాటు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వన్‌టౌన్ పోలీసులకు రాజవర్థన్ ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్ఐ బలివాడ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసు పెడతాం


మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ అవతారం

శ్రీకాకుళం క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా శుక్రవారం నగరంలో ట్రాఫిక్ సీఐ అవతారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు లేని ఎనిమిది మంది మైనర్లను ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. వారితో పాటు వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించిన సీఐ అవతారం కౌన్సిలింగ్ చేశారు. పిల్లల బాధ్యత తల్లిదండ్రులదేనని వారికి వాహనాలు ఇస్తే తొలుత తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆదిత్యుని సన్నిధిలో ఐఏఎస్ అధికారి


స్వామివారి జ్ఞాపికను అందిస్తున్న ఈవో

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని సెంట్రల్ సివిల్ సర్వీసెస్ జాయింట్ సెక్రటరీ ఎంవీ రావు(ఐఏఎస్) శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికి, వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ ఈవో చంద్రశేఖర్ స్వామివారి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి, అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, ధర్బముళ్ల శ్రీనివాస్‌శర్మ, ఇప్పిలి రంజిత్ శర్మ, ఇప్పిలి ఫణీంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 23 వరకు పారాయణం

శ్రీకాకుళం కల్చరల్: కోదండరామస్వామి ఆలయంలో ఏటా నిర్వహించేలానే ఈ ఏడాది కూడా శ్రీమద్రామాయణం పారాయణం మండల దీక్ష వచ్చే నెల వరకు 23 తేదీ పౌర్ణమి వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ పారాయణంలో పాల్గొనవచ్చునని అర్చకులు శేషాచార్యులు తెలిపారు.

బాధితులకు పరిహారం అందజేత

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం నియోజ కవర్గంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న ఇద్దరు ప్రమాదవ శాత్తు మరణించారు. బాధిత కుటుంబా లకు మంగళగిరిలో గల జనసేన పార్టీ కార్యాలయంలో కొణిదెల నాగేంద్రబాబు గురువారం చెక్‌లు అందించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు తెలిపారు. ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన కత్తుల శంకర్(26) ప్రమాదవ శాత్తు బైక్ ప్రమాదంలో మృతి చెందగా, అతని భార్య ధనలక్ష్మికి రూ.5లక్షల చెక్, సోంపేట మండలం ఇసుకల పాలెంకు చెందిన మత్స్యకారుడు గంటగ జనార్దన్(46) సముద్రంలో చేపల వేటకు వెళ్లి బోటు ప్రమాదంలో మరణించడంతో అతడి భార్య నూకమ్మకు రూ.5లక్షల చెక్కులు అందించినట్లు తెలిపారు.

చిలకలూరిపేట సభను విజయవంతం చేయండి


పాదయాత్రలో పాల్గొన్న కలిశెట్టి అప్పలనాయుడు

లావేరు: టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు ఉమ్మడిగా ఈ నెల 17న చిలకలూరిపేటలో నిర్వహించనున్న సభలో ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ ఉత్తరాంధ్ర శిక్షణా శిబిరం మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం మురపాకలో టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన సంఘీభావ యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ పార్టీతో పొత్తు కుదిరిన తర్వాత మొదటి సారిగా జరుగనున్న ఉమ్మడి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మురపాక అభయాంజేయ స్వామి ఆలయం నుంచి నాజానపేట వరకు పాదయాత్ర చేపట్టారు.

మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా ఎంపిక

గార: రాష్ట్ర వ్యాప్తంగా 40 ఫౌండేషన్ పాఠశాలలను ప్రభుత్వం ఎంపిక చేయగా, వాటిలో గార మండలం కె.మత్స్యలేశం యూపీ స్కూల్ ఉన్నట్టు సమగ్ర శిక్ష జిల్లా ఏఎంవో గుంట లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం సాయంత్రం పాఠశాల వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ పాఠశాల మోడల్ ఫౌండేషన్ స్కూల్‌లో ఎంపిక కావడానికి ఇక్కడ ప్రజల భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. ఈ సహకారం ఇలాగే కొనసాగితే ఈ పాఠశాలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ అయ్యేలా కృషి చేయొచ్చన్నారు. సర్పంచ్ బుడ్డా లలిత మాట్లాడుతూ తమ గ్రామ స్కూల్ ఫౌండేషన్ స్కూల్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసమే పొత్తులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ పొత్తు నిర్ణయం తీసుకుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. రామయ్య పుట్టుగలో స్వగృహం వద్ద శుక్రవారం వి లేకరులతో మాట్లాడారు. బీజేపీ-జనసేన పార్టీలతో టీడీపీ పొత్తు పెట్టుకున్నది కేవలం యువత భవిష్యత్తును కాపాడటం కోసమేనన్నారు. పదవులు, అధికారం ఆశించి తీసుకున్న నిర్ణయం కాదన్నారు. రాష్ట్రంలో అక్రమ కేసులు, కబ్జాలు, దాడులు, పోలింగ్ అక్రమా లతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారిని తరిమేయాలన్నదే టీడీపీ పొత్తులు పెట్టుకుందన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే టీడీపీ ధ్యేయం


చంద్రన్న రంజాన్ తోఫా అందిస్తున్న గొండు శంకర్

అరసవల్లి: అన్ని వర్గాల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ నాయకుడు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని ఓ కల్యాణ మండపంలో పేద ముస్లింలకు చంద్రన్న తోఫాను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల అభ్యున్నతికి నిరంతరం టీడీపీ కృషి చేసిందన్నారు. టీడీపీ హయాంలో ముస్లింలకు రంజాన్ తోఫా, చంద్రన్న సంక్రాంతి కానుకలు, క్రైస్తవులకు పేదలందరికీ ఇవ్వడం జరిగిందన్నారు. కానీ ఐదేళ్ల వైసీపీ పాలనలో వీటన్నింటినీ రద్దు చేశారన్నారు. బీజేపీతో పొత్తు ఉన్నందున టీడీపీ నిజాయితీని శంకించాల్సిన పని లేదని, దేశంలో అన్ని కులాలు, మతాలు సమానమేనన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 15 రోజుల్లో జామియా మసీదు అభివృద్ధికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జామియా మసీదు ఇమాం అబ్దుల్ వహాబ్, మీనా మసీద్ ఇమాం, ఎండీ జలాలుద్దీన్, ఇల్లిసిపురం మసీదు ఇమాం అబ్దుల్ అజీజ్, జామియా మసీదు మాజీ ఇమాం అన్వరుల్ హక్, వివిధ మసీదుల ఇమాంలు, ముస్లిం మతపెద్దలు సహారాఖాన్, ఛోటు భాయ్, బహదూర్ భాషా, షేక్ నిజాముద్దీన్, షేక్ మహమ్మద్, ఎండీ రఫీ, ఎండీ అహ్మద్ తాజ్, ఇలియాస్, సర్దార్, సలీం, హుస్సేన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసులకు క్రమశిక్షణ అవసరం: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల: పోలీసు సిబ్బందికి క్రమశిక్షణ అవసరమని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్లలోని సాయుధ పోలీసు మైదానంలో శుక్రవారం నిర్వహించిన పోలీసు పరేడ్‌ను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు సేవ చేయడంలో పోలీసు సిబ్బంది ముందు వరుసలో ఉంటామన్నారు. పోలీసు బ్యాండు పార్టీ సిబ్బందికి కొత్త యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు వై.శృతి, ఆర్.శ్రీనివాసరావు, ఎల్.శేషాద్రినాయుడు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె.నర్సింగరావు, ఆర్ఐలు పాల్గొన్నారు.

పంతం నెగ్గించుకున్న మాజీ కౌన్సిలర్

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని గేట్ వద్ద గల జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభించారు. అదే వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు తన భార్య పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అల్లంశెట్టి చిన్న పేరు శిలాఫలకంపై లేదని, గతంలో పాఠశాల ప్రారంభానికి నిరాకరించారు. ఈ నెల 12న బాలికల ఉన్నత పాఠశాల, గేటు ఉన్న పాఠశాలను స్పీకర్ ప్రారంభించాల్సి ఉండగా, శిలాఫలకం వివాదంతో తమ్మినేని అనుచర వర్గంలో ఒక్కసారి విభేదాలు బయటపడ్డాయి. దీంతో స్పీకర్ బాలికల ఉన్నత పాఠశాలను ప్రారంభించి, గేటు ఉన్నత పాఠశాల ప్రారంభించకుండా వెళ్లిపోయారు. మాజీ కౌన్సిలర్ కోరిక మేరకు గేటు ఉన్నత పాఠశాలలో కొత్త శిలాఫలకం ఏర్పాటుచేసి దానిపై మాజీ కౌన్సిలర్ భార్య తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పేరు వేయడంతో శు క్రవారం ఆ పాఠశాలను ప్రారంభించారు. దీనితో మాజీ కౌన్సిలర్ ఉమామహేశ్వరరావు తన పంతాన్ని నెగ్గించుకొని పాఠశాల ప్రారంభోత్సవాన్ని జరపడంపై వైసీపీ అంతర్గత విభేదాలు ఎత్తులు పైఎత్తులు భవిష్యత్తులో ఎలా ఉంటాయోనని వ్యాఖ్యానించుకుంటున్నారు.

పనులు పూర్తిచేయాలి

సోంపేట: అసంపూర్తిగా ఉన్న నాడు-నేడు పనులను వెంటనే పూర్తిచేయాలని ఎంఈవోలను డీఈవో కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఎంఆర్‌సీని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్.జోరాడు, జె.కృష్ణంరాజు, మోడల్‌పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నాజీవర్మ తదితరులు ఉన్నారు.

- కవిటి: బొరివంక జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో కె.వెంకటేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. టెన్త్ పరీక్షల నేపథ్యంలో పరిసరాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎంఈవో ధనుంజయ మజ్జి, హెచ్ఎం ఎస్.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పరిశోధనలపై దృష్టిసారించాలి

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ లో అధ్యాపకులు, విద్యా ర్థులు పరిశోధనపై దృష్టి సారించాలని వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో ని డాక్టర్ అబ్దుల్ కలాం బ్లాక్‌లో శుక్రవారం ఇం క్యుబేషన్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడా రు. నూతన పరిశోధనల కు వర్సిటీ వేదిక కావాలన్నారు. సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో ముం దుకువచ్చేవారికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.సుజాత, రెక్టార్ బి.అడ్డయ్య ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయ భాస్కర్, సీహెచ్.రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ధర్మవరంలో బీఆర్ఏయూ ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో వీసీ కేఆర్ రజని, ఎన్ఎస్ఎస్ పీవో డి.తాతారావు, సర్పంచ్ అల్లు కన్నబాబు, ఎంపీటీసీ బగ్గు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి నృత్య నీరాజనం



శ్రీకాకుళం అర్బన్: తిరుపతి వేంకటేశ్వరునికి ప్రతీరోజూ జరిగే కార్యక్రమాల్లో భాగంగా శ్రీకాకుళం నగరానికి చెందిన పరిమల హరిహర్, ఆమె శిష్యురాలు జె.శ్రీహ, జి.యశశ్విని నృత్య నీరాజనం అందించారు. నాథా నీరాజనంలో చేపట్టిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

రైతు సమస్యలపై పోరాటం

ఇచ్ఛాపురం: రైతుల దీర్ఘకాలిక సమస్యలపై పోరాటం చేసేందుకు రానున్న ఎన్నికల్లో సంఘం తరుపున ఇండింపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయాల్సిందేనని నియోజకవర్గ రైతు కులసంఘ కన్వీనర్ జన్నెల సూర్యవరప్రసాద్ అన్నారు. శుక్రవారం బెల్లుపడ జామిఎల్లమ్మ గుడి వద్ద రైతు సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. మాట్లాడుతూ నియోజకవర్గం నాలుగు మండలాల పరిధిలో రైతులకు సంబంధించి 28 ప్రధాన సమస్యలు ఉన్నాయి. వీటిని పరిష్కరించుకోవాలంటే రాజకీయంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో రైతులు కాళ్ల ధర్మారావు, కూర్మారావు, పాపారావురెడ్డ, విశ్వనాథంరెడ్డి, సీహెచ్ లోహిదాస్, రఘునాథ్ తదితరులుపాల్గొన్నారు.

లక్ష్మీదేవికే శ్రీకాకుళం అసెంబ్లీ టికెట్ ఇవ్వాలి


కన్నీటి పర్యంతమవుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి


ఎంపీ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు

ఆంధ్రజ్యోతి- శ్రీకాకుళం: శ్రీకాకుళం నియోజకవర్గ అసెంబ్లీ టికెట్ బీజేపీకి కేటాయిస్తున్నారన్న వార్తలపై నియోజకవర్గ టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. నియోజకవర్గంలో దశాబ్దాల తరబడి గుండ దంపతులకే టీడీపీ టికెట్ ఇస్తుండగా.. ఈ సారి పొత్తుల నేపథ్యంలో బీజేపీకే ఇస్తే ఎలా అంటూ నియోజకవర్గ కార్యకర్తలు శుక్రవారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ ఇంటి ముందర టీడీపీ శ్రేణులు చేరి నిరసన తెలిపారు. ఎంపీ అందుబాటులో లేకపోవడంతో.. ఫోన్‌లో మాట్లాడి విషయాన్ని తెలియజేశారు. తాను చంద్రబాబుతో మాట్లాడతానని హామీఇచ్చారు. అనంతరం టీడీపీ శ్రేణులు గుండ దంపతుల ఇంటి వద్దకు చేరుకున్నారు. లక్ష్మీదేవికే టికెట్ కేటాయించాలంటూ కార్యకర్తలు హడావిడి చేశారు. మాజీమంత్రి గుండ అప్పలసూర్యనారాయణ మాట్లాడుతూ.. తాము ఎప్పటికీ చంద్రబాబుకి విధేయులమేనని.. తమకు చంద్రబాబు మాటే శిరోధార్యమని తెలిపారు. ఈ సందర్భంగా గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ.. కార్యకర్తలకు నచ్చజెప్పుతూ తాను కన్నీటి పర్యంతమయ్యారు. పార్టీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, కార్యకర్తలు జల్లు రాజీవ్, విభూది సూరిబాబు, తోణంగి వెంకన్నయాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు

ఆమదాలవలస: ఆమదాల వలస జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. గత రెండుసార్లు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న కణితి విజయలక్ష్మీ బాయ్ శుక్రవారం మూడోసారి కూడా అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారు. న్యాయవాది పైడి వరహాల నరసింహం విజయలక్ష్మీబాయిను ప్రతిపాదించారు. న్యాయవాది సాదు ధనుంజయరావు, బార్ అసోసి యేషన్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం

జి.సిగడాం: నిద్దాంలో నూత నంగా నిర్మించిన రామాలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. వేదపండితుల మంత్రాల నడుమ సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో తిరువీధి నిర్వహించారు. మహిళలు ముర్రాటలు చెల్లించి ఉత్సవ విగ్రహాలను శుద్ధి చేసి పూజలు చేశారు. మూడు రోజులు పాట అభిషేకాలు, హోమాలు పూజలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు.

అధికారుల తీరుపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

ఆమదాలవలస: అధికార పార్టీ వ్యామోహంలో స్పీకర్ తమ్మినేని సీతారాం తొత్తులుగా నియోజకవర్గంలోని కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్నారని టీడీపీ న్యాయ విభాగం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బోర గోవిందరావు మండిపడ్డారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఓటమి భయంతో స్పీకర్ తమ్మినేని సీతారాం వలంటీర్లకు తాయిలాలు ఇవ్వడం ఎన్నికల నిబంధనల ఉల్లంఘనేనని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్ ఇంజనీరింగ్ అధికారి కూడా వలంటీర్ల నగదు పంపిణీలో పాల్గొనడం, వారి అధికార పార్టీ స్వామిభక్తికి నిదర్శనమన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమవద్ద ఉన్నాయని, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నూకరాజు, యువ నాయకులు మురళీధర్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో విభేదాలపై విచారణ

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఆసుపత్రిలో (సీహెచ్‌సీ) వైద్యులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ మధ్య విభేదాలపై ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ ఎన్.కల్యాణ చక్రవర్తి, రాజాం ప్రాంతీయ ఆసుపత్రి ఏవో కె.చంద్రశేఖర్ శుక్రవారం విచారణ జరిపారు. ఆసుపత్రిలో అంతర్గత విభేదాలు సేవలపై ప్రభావం చూపుతాయని, ఏమైనా సమస్య ఉంటే పరిష్కరించుకోవాలన్నారు. అత్యవసరాలకు మొదట ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సిబ్బందిని కలుపుకుపోవాలని, వైద్యుల అవసరాలను గుర్తించి అవసరమైనవాటిని కొనుగోలుకు హెచ్‌డీఎస్ నిధులను వినియోగించాలని సూపరింటెండెంట్ రామదాస్‌ను ఆదేశించారు. వైద్యులు తన పరిధిలో విధులు నిర్వహిస్తున్నారనుకుని, వారు ఫిర్యాదు చేసేంతవరకు తెచ్చుకోవద్దని జూనియర్ అసిస్టెంట్ అనూషను మందలించారు. ఆసుపత్రి వైద్యులు సుజాత, ప్రియాంకలతో మాట్లాడి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అంచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

రంజాన్ తోఫా పంపిణీ

గార: జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు టీడీపీ నాయకులు గొండు శంకర్ సమకూర్చిన రంజాన్ తోఫా కిట్లను శుక్రవారం శ్రీకూర్మం పంచాయతీలోని 10 కుటుంబాలకు పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ నాయకులు మైగాపు ప్రభాకరరావు, వీఎస్ గిరి, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

గార: జొన్నలపాడు, శిమ్మపేట గ్రామాల్లో ఉపాధి పథకం వేతనదారులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం అక్కడ వేతనదారులతో మాట్లాడుతూ ఈ మేరకు బిల్లులు చెల్లింపు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

గుజరాతీపేట: వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన అవసరమని కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ఆధ్వర్యంలో వినియోగదారుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. వస్తువు కొనుగోలు చేశాక వాటి బిల్లు, వారెంటీ తీసుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరరావు, హెచ్‌వోడీ కృష్ణారావు, సీహెచ్ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

'ప్రజా సంక్షేమానికి కలిసి పనిచేద్దాం'


మాట్లాడుతున్న విశ్వప్రసాద్

బూర్జ: ప్రజా సంక్షేమానికి అందరం ఐక్యంతో కలిసి పనిచేద్దామని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టీడీపీ నాయకులు మొదలవలస రమేష్ అన్నారు. శుక్రవారం ఏపీపేట, కాళపర్తి, లాభాం, వైకుంఠపురం పంచాయతీల్లో టీడీపీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో రాక్షసపాలన సాగిందని, ఆ పాలనకు నేటితో స్వస్తి చెప్పడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొరికాన వెంకట శివసాయి సీతారామరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి రామ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం

- బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో వెలుగుచూసిన ఘటన
- ఉద్యోగిని తొలగించిన అధికారులు

బొబ్బిలి: నకిలీ ఇంజనీరింగ్ సర్టిఫికెట్లతో విజయనగరం జిల్లా బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో ఏటీవోగా విధులు నిర్వహిస్తున్న మెట్ట సిద్ధార్థ్‌పై వచ్చిన ఫిర్యాదుపై సంబంధిత అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన నకిలీ సర్టిఫికెట్లతో చేరినట్లు నిర్ధారణ కావడంతో అతడ్ని ఉద్యో గం నుంచి తొలగించారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట మం డలం మామిడిపల్లి గ్రామానికి చెందిన సిద్ధార్థ్ ప్రభుత్వ ఐటీఐలో 2021లో ఏటీఓగా (అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్) చేరాడు. కిల్లాడ గ్రామానికి చెందిన మురళి అన్నదానం, బొబ్బిలి తారక రామాకాలనీకి చెందిన విద్యార్థుల సంఘ నాయకుడు ఇతని సర్టిఫికెట్లపై అనుమానం వ్యక్తం చేస్తూ సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విజయ నగరం ఐటీఐ ప్రిన్సిపాల్ గిరి, విజిలెన్స్ అధికారులు నిర్వహించిన దర్యాప్తులో నకిలీ సర్టిఫికెట్లు అని నిర్ధారణ కావడంతో అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలె క్టర్ సిఫారసు చేశారు. దీంతో సిద్ధార్థని ఉన్నతాధికారులు ఉద్యోగంలో నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రమణారావు శుక్రవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా అందజేస్తు న్నామని ఆయన తెలిపారు.

జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం తప్పదు

అరసవల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌రెడ్డి పాలనకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడబోతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏబీపీ - సీవోటర్, న్యూస్-18 మెగా ఓపీనియన్ పోల్ సర్వే ఫలితాలను చూసి తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు మొదలైందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు పట్టం కట్టనున్నట్టు జాతీయ మీడియా సంస్థలు అంచనా వేశాయని తెలిపారు.

19న డీఎంహెచ్‌వో గ్రీవెన్స్ డే

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బి.మీనాక్షి ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఈ నెల 19వ తేదీన గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్టు జిల్లా మాస్ మీడియా అధికారి పీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల ఉద్యోగుల వేతనాలకు సంబంధించి సమస్యలపై వినతులు ఇవ్వాలని కోరారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

జి.సిగడాం: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో వెంకన్నబాబు సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఎస్‌పీఆర్ పురంలో పలు వీధులను ఆయన పరిశీలించి సూచనాలు చేశారు వేసవి కాలం దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి కూను బిల్లి కోటేశ్వరరావు, పలు శాఖల సిబ్బంది ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

జి.సిగడాం: వ్యవసాయ సాగులో పంటపై సోకుతున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్ సూచించారు. శుక్రవారం దేవరవలసలో ఆత్మా ఆధ్వర్యంలో రైతులకు తెగుళ్లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటకు కత్తెర పురుగుసోకే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ బి.శ్రీనివాసరావు, డీఆర్‌పీ సూర్యకుమారి, ఏవో ఎర్రా శారద పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఇచ్ఛాపురం: ప్రతీ పౌరుడు తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని ఏపీఎం ననపల ప్రసాద్ అన్నారు. శుక్రవారం సమైఖ్య కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై అవగహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు.

సాదాసీదాగా మండల సమావేశం

కవిటి: మండల పరిషత్ సాధారణ సమావేశం శుక్రవారం ఎంపీపీ కె.పద్మ అధ్యక్షతన జరిగింది. శాఖలపై జరిగిన చర్చలో రాజపురం ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంపై ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఎంపీటీసీ ఎస్.కృష్ణారావు ప్రశ్నించారు. సహలాలపుట్టుగలో జాబ్‌కార్డులు మంజూరు చేయాలని సర్పంచ్ రవిప్రదాన్ కోరారు. ఏపీవో భాస్కరరావు సమాధానమిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం జరుగుతుందన్నారు. వివిధ అంశాలపై చర్చించారు. ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ కె.లక్ష్మి, ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొన్నారు.

రుణాలు రెన్యువల్ చేసుకోండి

లావేరు: స్థానిక పీఏసీఎస్ ద్వారా పంట రుణాలు పొందిన రైతులు ఈ నెల 20వ తేదీ లోగా 7 శాతం వడ్డీ చెల్లించి రాయితీని పొందాలని మండల పీఏసీఎస్ చైర్మన్ బూరాడ చిన్నారావు కోరారు. లేకుంటే 13 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. పంట రుణాలు రెన్యువల్ చేయించు కోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని చైర్మన్ చిన్నారావు కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇచ్ఛాపురం: మండలంలో వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ శుక్రవారం శంకుస్థాపన చేశారు. డొంకూరులో అంగన్‌వాడీ భవనం, బీచ్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పంచాయతీ మహిళలతో సమావేశం నిర్వహించారు.